# రైతులను పట్టించుకోని ప్రభుత్వం


కాసులాబాద్‌లో పెద్దదేవి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, మార్చి 30: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం వల్లనే నేడు గ్రామాల్లో వరిపొలాలు ఎండిపోతున్నాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం కాసులాబాద్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ నూతన దేవాలయంలో పెద్దమ్మ పెద్దిరాజుల విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాల్లో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, పార్టీ రాష్ట్ర నాయకుడు బొంపల్లి మనోహర్‌రావుతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రైతులను ఆర్థికంగా రాజులను చేయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నుంచి రైతులకు సాగునీటిని విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి, చేగుంట నార్సింగ్, దుబ్బాక మండలాల్లోని రైతులు వరి పంటల సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారన్నారు. శనివారం నుంచి మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి కూడవెల్లి వాగులోకి సాగునీటి విడుదల చేయాలని మంత్రులకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు సత్యనారాయణ, బాపురెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, సూకూరి లింగం, మాజీ సర్పంచ్‌లు బాల్‌రాజు, శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మాలమహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్‌కు సన్మానం


శ్రీరాములకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

మిరుదొడ్డి, మార్చి 30: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ర్యాకం శ్రీరాములను ఇటీవల తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శనివారం ర్యాకం శ్రీరాములను మాల మహానాడు నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి, ప్రధాన కార్యదర్శి జక్కుల రాజయ్య, మిరుదొడ్డి మండల అధ్యక్షుడు దార స్వామి, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు రాజేందర్, అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ పెండ్లికి అన్నీ తామై..


లావణ్య పెండ్లి జరిపిస్తున్న అలయన్స్, వాసవి క్లబ్ సభ్యులు

సిద్దిపేట టౌన్, మార్చి 30: పేదింటి ఆడబిడ్డకు అన్నీ తామై సిద్దిపేట అలయన్స్, వాసవి క్లబ్‌లు పెండ్లి జరిపించి ఆదర్శంగా నిలిచాయి. వివరాల్లోకి వెళ్తే.. నాగపురి గ్రామానికి చెందిన నిరుపేద యువతి లావణ్య తల్లిదండ్రులు చనిపోయారు. ఆమెకు అలయన్స్, వాసవి క్లబ్‌లు అండగా నిలిచాయి. సిద్దిపేట ఇందిరానగర్‌కు చెందిన రాజుతో శనివారం స్థానిక వైశ్య భవన్‌లో వివాహం జరిపించారు. సుమారు 300 వందల మంది అతిథులను పిలిచి విందు భోజనం ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్ ఆత్మరాములు, వైకుంఠం, అంజయ్య, శివకుమార్, బాలచంద్రం, రామచంద్రం, గంప శ్రీనివాస్, కృష్ణమూర్తి, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న రైస్‌మిల్లర్లు

హుస్నాబాద్, మార్చి 30: రైతులు ఆరుగాలం కష్టపడి పనిచేసి పండించిన పంటను కొనుగోలు చేయడంలో రైస్‌మిల్లర్లు మోసాలకు పాల్పడుతున్నారని రైతు రక్షణ సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్ ఆరోపించారు. శనివారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడం వల్ల కొందరు రైతులు వరికోసిన అనంతరం పచ్చివడ్లనే రైస్ మిల్లులకు తరలించి విక్రయిస్తుండగా మిల్లు యజమానులు, ఇతర వ్యాపారులు రూ.1800లకే కొనుగోలు చేస్తున్నారని, అదనంగా మూడు కిలోల వడ్లను తరుగు పేరుతో కటింగ్ పెడుతున్నారని ఆరోపించారు.

# అభివృద్ధి పనుల్లో అవినీతిపై విచారణ జరపాలి

కొమురవెల్లి, మార్చి 30 : కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద గత పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భారీ అవినీతి జరిగిందని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆరోపించారు. శనివారం కొమురవెల్లి మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులు హుండీలో వేసిన కానుకల డిపాజిట్లను అభివృద్ధి పేరుతో విడిపించి గత పాలకమండలి కోట్ల రూపాయలు వృథా చేసిందన్నారు. ఆలయ భూమి నుంచి మట్టి తవ్వి దాసరం గుట్టకు మట్టి రోడ్డు పోసి రూ.4.5కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. రవీందర్, ఇస్తారి, మల్లేశం, భిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అల్వాలలో వరుస దొంగతనాలు


అల్వాలలో దొంగతనాలు జరిగిన ఇండ్లను పరిశీలిస్తున్న పోలీసులు

మిరుదొడ్డి, మార్చి, 30: తాళాలు వేసిన ఇండ్లనే టార్గెట్ చేసుకొని వరుస దొంగతనాలతో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. అందిన కాడికి నగలు, నగదుతో పాటు పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని అల్వాలలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బాధితులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీటి బాబు ఇంటితాళం పగులగొట్టి తన కూతురు పెండ్లికి తెచ్చి పెట్టుకున్న రూ.50 వేలు, కేశవాచారి ఇంట్లో రూ.30 వేల నగదుతో పాటు 3తులాల బంగారం, 50 తులాల వెండి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి ఇంట్లో 2 తులాల బంగారం, రాముడి పంచలోహ విగ్రహాలు, పూజా నర్సింహులు ఇంట్లో రూ.7 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితులు మిరుదొడ్డి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, మిరుదొడ్డి ఎస్సై పరశురాములు నేతృత్వంలో డాగ్‌స్కాడ్ క్లూస్ టీంతో చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించారు. ఇదే గ్రామంలో జనవరి 30న సోమరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బొమ్మ నవీన్, రొడ్డ నర్సవ్వ, బొమ్మ కరుణాకర్, బొమ్మ శేఖర్ ఇండ్లలో దొంగలు పడగా బొమ్మ నవీన్ ఇంట్లో అరతులం బంగారు కమ్మలు, రొడ్డ నర్సవ్వ ఇంట్లో రూ.10 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు.

# ఫిర్యాదులను పరిష్కరించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

సిద్దిపేట అర్బన్, మార్చి 30 : సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. సువిధ అనుమతులు జాప్యం లేకుండా నిర్దేశించిన సమయంలోగా ఇవ్వాలన్నారు. ఎన్నికల విధులకు నియమించబడిన ఉద్యోగులందరికీ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేస్తూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఓటర్ జాబితా సవరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఫారాలను పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, డీఆర్వో నాగరాజమ్మ, ఆర్డీవోలు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

## ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- అదనపు కలెక్టర్, దుబ్బాక ఆర్వో గరీమా అగర్వాల్

సిద్దిపేట అర్బన్, మార్చి 30: ఎన్నికల విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, భారత ఎన్నికల సంఘం ప్రతిసారి కొత్త మార్గదర్శకాలు రూపొందిస్తున్నదని అదనపు కలెక్టర్, దుబ్బాక ఆర్వో గరీమా అగర్వాల్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పీపీటీ హ్యాండ్ బుక్‌ను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ఈవీఎం యంత్రాల్లో బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్ అనుసంధానం ప్రక్రియ, పోలింగ్ డే రోజు మాక్ పోల్ ప్రక్రియ, పలు పత్రాలు నింపే విధానం గురించి తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎలాంటి సందేహాలు ఎదురైనా బుక్‌లో నోట్ చేసుకొని ఉన్నతాధికారులకు తెలిపి నివృత్తి చేసుకోవాలన్నారు. డీఆర్వో నాగరాజమ్మ, డీపీవో దేవకీదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

## అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

దుబ్బాక టౌన్, మార్చి 30 : ఇటీవల సంగారెడ్డిలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాజీమంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై రఘునందన్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో అతని తీరు పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ దుబ్బాక శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం దుబ్బాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రొట్టె రాజమౌళి, కౌన్సిలర్లు ఇల్లందుల శ్రీనివాస్, ఆస యాదగిరి, బాలకృష్ణ, స్వామి, కో-ఆప్షన్ సభ్యుడు ఆసస్వామి, జిల్లా నాయకుడు అధికం బాలకిషన్‌గౌడ్, పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణగౌడ్ మాట్లాడారు. మేధావి, లాయర్‌ను అనే చెప్పుకునే రఘునందన్‌రావు మాటలు ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా హింసను ప్రేరేపించే విధంగా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని రఘునందన్‌రావును హెచ్చరించారు. నాయకులు లొంక లచ్చయ్య, గోనెపల్లి సంజీవరెడ్డి, భూంరెడ్డి పాల్గొన్నారు.

## వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

నంగునూరు, మార్చి 30: మెదక్ లోక్‌సభ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్వీ నాయకులు కోరారు. నంగునూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ తరపున నిలబడిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సిద్దిపేట కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. సమావేశంలో జేపీ తండా మాజీ సర్పంచ్ భిక్షపతినాయక్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు గోవిందారం రవి, నాయకులు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## సబ్ కోర్టు ఏర్పాటు చేయాలి


మంత్రి పొన్నంను కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

హుస్నాబాద్, మార్చి 30: హుస్నాబాద్‌లో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసిన బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు పలు సమస్యలను మంత్రికి వివరించారు. సబ్ కోర్టు లేకపోవడం వల్ల న్యాయవాదులతో పాటు కక్షిదారులు కూడా కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని మంత్రికి చెప్పినట్లు నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం సరిపోవడం లేదని, కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జుమ్లాల్‌నాయక్, ఉపాధ్యక్షుడు కన్నోజు రామకృష్ణ, సహాయ కార్యదర్శి రవీందర్, జేఈసీ సభ్యుడు దీకొండ ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, బాలకిషన్, ఆంజనేయులు, కిరణ్, సంపత్‌కుమార్, సదన్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


హుస్నాబాద్‌రూరల్: పోతారం(ఎస్)లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న తనూజ

అక్కన్నపేట/హుస్నాబాద్‌రూరల్, మార్చి 30: అక్కన్నపేట మండలంలోని జనగామ, హుస్నాబాద్ మండలంలోని పోతారం(ఎస్)లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి వరిధ్యాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్ ఏ గ్రేడ్ రూ. 2203, బీ గ్రేడ్‌కు రూ. 2183 ప్రభుత్వ మద్దత ధర నిర్ణయించిందన్నారు. డీసీఎస్‌వో తనూజ, డీపీఎం కరుణాకర్, ఎంపీడీవో భానోతు జయరామ్, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రవీందర్, తిరుపతి, ఏఈవోలు శ్రీలత, విజయ్, సీఏలు కనకతార, అనిత, స్వరూప, వీవో అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

హుస్నాబాద్, మార్చి 30: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ అన్నారు. శనివారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. సివిల్ సప్లయ్ డీఎం హరీశ్, స్థానిక సింగిల్‌విండో సీఈవో తిరుమల, రైతులు పాల్గొన్నారు.

**సకాలంలో కేంద్రాలు ప్రారంభించాలి**

గజ్వేల్, మార్చి 30: సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డీఆర్డీవో జయదేవ్ అన్నారు. శనివారం గజ్వేల్ ఐవోసీ భవనంలో నియోజకవర్గ వీవోఏ, సెర్ప్ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ మధు, డీపీఎం వాసుదేవ్, ఆర్‌ఎం శ్రీనిధి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి డాక్టర్ రఘురామ్

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 30: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా జడ్జి డాక్టర్ టి.రఘురామ్ అన్నారు. కొండపాక మండలం దుద్దెడ శాంభవి మోడల్ స్కూల్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రాథమిక హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో అనవసర పోస్టింగ్‌లు పెట్టి ఇబ్బందులకు గురికావొద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా విద్యార్థులు వాహనాలు నడపడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి, ఏసీపీ మధు, ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ప్రిన్సిపాల్ రమేశ్, కరస్పాండెంట్ లక్ష్మీసుజాత, న్యాయ సేవ సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించొచ్చు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట అర్బన్, మార్చి 30 : పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని టీటీసీ భవన్‌లో జరిగిన కాకతీయ టెక్నో పాఠశాల 14వ వార్షికోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో అధిక సమయం వెచ్చించకుండా చదువుపై ఆసక్తి పెంచుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని జడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో 'రన్ ఫర్ జీసస్'

హుస్నాబాద్, మార్చి 30: హుస్నాబాద్ నియోజకవర్గ పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సండే సందర్భంగా శనివారం హుస్నాబాద్ పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి మల్లె చెట్టు చౌరస్తా, మెయిన్‌రోడ్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు క్రైస్తవ పాస్టర్లు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మోకాళ్లపై కూర్చొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ నియోజకవర్గ చైర్మన్ మలాకీ, ప్రధాన కార్యదర్శి సాల్మన్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, పాస్టర్లు ప్రకాశ్‌రెడ్డి, డేవిడ్, ఇశ్రాయిల్, ఐజాక్, జాన్సన్, వర్గిన్, పీటర్, ప్రేమానందం, మంత్యనాయక్, ఏలియా, రత్నం, రత్నకుమార్, వివేక్, ఆశిష్, చందుపాల్, మోహన్‌దాస్, ప్రశాంత్, దివాకర్ పాల్గొన్నారు.

# దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విచారణ

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 30 : కొండపాక మండలంలోని దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని టెన్త్ పరీక్షా కేంద్రంలో బాలిక పట్ల ఇన్విజిలేటర్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఫిర్యాదుపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 26న భౌతికశాస్త్రం పరీక్ష రాస్తుండగా తన పట్ల ఓ ఇన్విజిలేటర్ అసభ్యకరంగా ప్రవర్తించాడని ఓ విద్యార్థిని పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ లక్ష్మికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కొండపాక ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్‌తో పాటు సిబ్బందిని విచారించారు. అనంతరం బాధిత విద్యార్థినితో లిఖితపూర్వకమైన ఫిర్యాదు తీసుకున్నారు. విచారణ అనంతరం విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వారు తెలిపారు.

## ముగిసిన పదవ తరగతి ప్రధాన పరీక్షలు

సిద్దిపేట అర్బన్, మార్చి 30 : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న టెన్త్ ప్రధాన పరీక్షలు ముగిశాయి. శనివారం సాంఘిక శాస్త్రం పరీక్ష జరిగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రధాన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్ 1, 2 తేదీల్లో ఒకేషనల్ పరీక్షలు జరుగనున్నాయి. సోమవారం ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్-1, మంగళవారం ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజీ పేపర్-2 పరీక్ష జరుగనున్నది. దీంతో పదోతరగతి పరీక్షలు పూర్తి కానున్నాయి.

# కొండపాక వైస్ ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 30 : సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలో 20 రోజులుగా ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై ఎంపీటీసీలు ప్రకటించిన అవిశ్వాస తీర్మానం అందరిలో చర్చనీయాంశంగా మారింది. ఈనెల 28న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ సమక్షంలో ఎంపీపీ ర్యాగల సుగుణదుర్గయ్యపై తొమ్మిది మంది ఎంపీటీసీలు చేసిన అవిశ్వాసం నెగ్గిన విషయం అందరికీ తెలిసిందే. తాజాగా ఆ తరహాలో వైస్ ఎంపీపీ దేవీ రవీందర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో బన్సీలాల్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ అవిశ్వాస సమావేశానికి 8 మంది మాత్రమే హాజరుకావడంతో మెజార్టీ లేనందున అవిశ్వాసం వీగినట్లు ఆర్డీవో బన్సీలాల్ తెలిపారు.

## నూతన సభ్యత్వాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

తొగుట, మార్చి 30: తెలంగాణ ముదిరాజ్ మహారాజ్ మహాసభల ఆధ్వర్యంలో మిరుదొడ్డి మండల ఖాజీపూర్ గ్రామ ముదిరాజుల సొసైటీ ఎన్నికలతో పాటు నూతన సభ్యత్వాలు ఇవ్వాలని కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభల కార్యనిర్వాహన కార్యదర్శి దమ్మిగారి కనకయ్య ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు యమధర్మ ముదిరాజ్, తొగుట మండల అధ్యక్షుడు ఉల్లెంగల సాయికుమార్ ముదిరాజ్, దుబ్బాక ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మడ బోయన రాజు, ఖాజీపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు రమేశ్,మల్లయ్య పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

సిద్దిపేట అర్బన్, మార్చి 30: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీ(నెం.టీఎస్19టీఏ-7500)ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎలాంటి వే బిల్, ప్రభుత్వ అనుమతి లేకుండా భూపాలపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తుండగా.. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ధర్మకాంట వద్ద లారీ ఆగిఉండగా.. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, త్రీ టౌన్ పోలీసులు పట్టుకున్నారు.

# మల్లన్న ఆదాయం రూ.61,89,123

చేర్యాల, మార్చి 30: కొమురవెల్లి మల్లికార్జునస్వామి హుండీలను ఆలయంలో లెక్కింపులు జరిపారు. 15 రోజుల్లో హుండీల ఆదాయం రూ.61,89,123 సమకూరింది. ఆలయ హుండీలను మహామండపంలో ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ పర్యవేక్షణలో శనివారం లెక్కింపులు జరిగాయి. 23 హుండీలను ఆలయ అర్చకులు, ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బంది, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన శ్రీ శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు లెక్కించారు. నగదుతో పాటు, 75గ్రాముల మిశ్రమ బంగారం, 6కిలోల 400గ్రాముల మిశ్రమ వెండి, 12 క్వింటాళ్ల బియ్యం, 23 ఇతర దేశాల కరెన్సీ లభించింది. కొమురవెల్లి ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు శ్రీనివాస్, బచ్చల శ్రీనివాస్, పాత్తే శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, కాగితా మోహన్ రెడ్డి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను చెల్లింపు

చేర్యాల, మార్చి 30: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం మున్సిపాలిటీకి పన్ను చెల్లించకపోవడంతో శుక్రవారం స్కూల్ ప్రధాన గేట్‌కు అధికారులు తాళం వేశారు. దీంతో పాఠశాలకు సంబంధించిన రూ.3,18,904 ఆస్తిపన్నును నిర్వాహకులు చెల్లించడంతో కమిషనర్ గోల్కోండ నర్సయ్య తాళం తీశారు. కమిషనర్ మాట్లాడుతూ బకాయి ఉన్న ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ జె.ప్రభాకర్, ఇన్‌చార్జి ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.500 బోనస్ ఇవ్వాలి

హుస్నాబాద్, మార్చి 30: యాసంగిలో రైతులు పండించిన ధాన్యానికి (క్వింటాల్‌కు) రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రైతులు పండించి ఏ పంటకైనా రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎన్నో చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వారినే మోసగిస్తున్నదని ఆరోపించారు. పండిన పంటకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని, లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

## యాదవ సంఘం కమిటీ ఎన్నిక

హుస్నాబాద్, మార్చి 30: హుస్నాబాద్ పట్టణ(ఆరెపల్లి) యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. ఆరెపల్లికి చెందిన గొర్ల లింగయ్యయాదవ్ 19ఓట్ల మెజార్టీతో కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కాశబోయిన అశోక్ 15 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా దొంతరబోయిన హరీశ్, కోశాధికారిగా సాంబరాజు గెలుపొందారు. సహాయ కార్యదర్శిగా పోతరబోయిర రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎల్లయ్య, తిరుమలేశు, పరశురామ్, సాంబరాజు, రమేశ్, శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కౌన్సిలర్ వేణు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన కార్యవర్గాన్ని వేణుతో పాటు కులపెద్దలు సన్మానించారు.

## పేదల పొట్ట కొట్టొద్దు

సిద్దిపేట టౌన్, మార్చి 30: జకత్ వితరణపై రాజకీయాలు చేసి పేదల పొట్ట కొట్టొద్దు అని బీఆర్ఎస్ మైనార్టీ నేతలు మోయిజ్, వజీర్, జావెద్ విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఆర్ఆర్ గ్రూప్స్ వారు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు జకత్ వితరణ చేస్తారని..అందులో భాగంగానే రేషన్ సిద్దిపేటకు పంపించారే తప్పా ఏరాజకీయ పార్టీకి సంబంధం లేదన్నారు.ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులతోపాటు మరి కొందరు రాజకీయం చేస్తూ పేదల కడుపు కొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మన్సూర్, సయీద్, గోరు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా ప్రేమ్‌కుమార్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి30: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రిఫరీగా మద్దూరు మండల కేంద్రానికి చెందిన దామెర ప్రేమ్‌కుమార్ ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఏప్రిల్ 5వరకు బీహార్ రాష్ట్రంలో జరుగనున్న సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ప్రేమ్‌కుమార్ రిఫరీగా వ్యవహరించనున్నారు. ప్రేమ్‌కుమార్ ఎంపికపై హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌గుప్తా, మల్లేశం, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ములుగు, మార్చి 30: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రంతో పాటు వంటిమామిడి, సింగన్నగూడలోని ఎరువుల విక్రయకేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈపాస్ స్టాక్ నిల్వలు, వాస్తవ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల మేరకు క్రయ విక్రయాలు చేయాలని డీలర్లకు సూచించారు. ఆయన వెంట ఏవో ప్రగతి, ఏఈవో పృథ్వీ ఉన్నారు.

## దుకాణంలో మంటలు

హుస్నాబాద్, మార్చి 30: హుస్నాబాద్ పట్టణంలోని పాత సామాను దుకాణంలో శనివారం మంటలు లేచాయి. దుకాణంలోని సామాను దగ్ధమైంది. దుకాణంలోని రబ్బరు పైపులు, ఇతర పాత సామాన్లకు అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. వెంటనే స్థానిక ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్‌మెన్ వెంకటేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.1.50లక్షల నష్టం జరిగినట్లు దుకాణం యజమాని మోతె సమ్మయ్య తెలిపారు.